క్లుప్తంగా

పుష్ప ప్రదర్శన భేష్..

- శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు



పుష్ప ప్రదర్శనను ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి సంధ్యారాణి

విజయనగరం ఫోర్ట్: పుష్ప ప్రదర్శన బాగుందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ట్యాంక్‌బండ్ రోడ్డులో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుష్ప ప్రదర్శనను మంత్రి గుమ్మడి సంధ్యారాణితో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఉద్యానశాఖ డీడీ జమదగ్ని, ఎ.డి శైలజ, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ శ్రీక్షేత్రమ్‌లో విజయదశమిని పురస్కరించుకుని కల్యాణ వేంకటేశ్వరస్వామికి శనివారం 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులు సామూహిక విష్ణు సహస్రనామం, గోవిందనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

విజయనగరం రూరల్: మండలంలోని సారిక పంచాయతీలో ఉన్న కామేశ్వరిదేవి అనుగ్రహ పీఠంలో శనివారం సాయంత్రం అత్యంత వైభవంగా శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త శ్రీరంగం సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- 33వ డివిజన్ కార్పొరేటర్ రంగారావు



రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: రక్తదానంతో రోగి ప్రాణాలు కాపాడవచ్చని 33వ డివిజన్ కార్పొరేటర్ జీవీ రంగారావు అన్నారు. ఆదివారం స్థానిక న్యూలైఫ్ బ్లడ్ సెంటర్‌లో ఏపీజే అబ్దుల్ కలామ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మనిషి మాత్రమే రక్తదానం చేసి ఆపదలో ఉన్న సాటి మనిషి ప్రాణాలు కాపాడగలడన్నారు. ఆరోగ్యకరమైన స్త్రీ, పురుషులు ఎవరైనా మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అబ్దుల్ రవూఫ్, గోవింద్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో వైభవంగా జమ్మి వేట

- స్వామివారి ఆయుధాలకు ప్రత్యేక పూజలు



బోడికొండ మెట్ల మార్గం వద్ద స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో విజయదశమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. సీతారామచంద్రమూర్తి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగింపుగా బోడికొండ మెట్ల మార్గం వద్దకు తీసుకువెళ్లి అర్చకులు విశేష పూజలు జరిపించారు. తదుపరి స్వామి వారి ఆయుధాలైన ధనుస్సు, ధనుర్బాణం, ఖడ్గం, తదితరాలను సంప్రదాయ బద్ధంగా జమ్మి వృక్షంపై ఉంచి అర్చనలు చేశారు. అనంతరం స్వామివారిని తిరిగి దేవాలయానికి పల్లకిలో తీసుకువచ్చారు.

ప్లాస్టిక్ వినియోగం తగదు

విజయనగరం: పైడితల్లి తొలేళ్లు, సిరిమానోత్సవం సందర్భంగా ప్రసాద వితరణలో ప్లాస్టిక్ ఉత్పత్తులను వినియోగించవద్దని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి. నల్లనయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా రోజుల్లో భక్తులకు వివిధ ప్రాంతాలలో అనేక మంది ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపడుతుంటారని, అయితే ప్రసాదాలు కేవలం విస్తరాకులు, పేపర్ ప్లేట్లలో అందించాలని సూచించారు. అలాగే ప్రసాద వితరణ చేపడుతున్న ప్రాంతాలలో డస్ట్‌బిన్లను నిర్వాహకులే ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

విజయనగరం క్రైమ్: పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. స్పెషల్ బ్రాంచ్ పోలీసుల దాడుల్లో భాగంగా స్థానిక వన్‌టౌన్ పరిధిలోని ఓ హోటల్‌లో పేకాట ఆడుతున్న గుర్ల మండలానికి చెందిన ఆరుగురు వ్యక్తులను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.42వేల 800 నగదు, ఆరు సెల్‌ఫోన్‌లు, గేమింగ్ కార్డ్స్ సీజ్ చేశారు. నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ఘటం అమ్మ ప్రతిరూపం



పైడితల్లి ఘటాలు తీసుకువస్తున్న భక్తులు

- సన్నిధానంలో రెండు తల్లి, ఆరు పిల్ల ఘటాలు
- మట్టి కుండ, బిందె, చెంబు రూపంలో నివేదన
- ఈ ఏడాది 30 వేల మందికి పైగా భక్తులు ఘటాల సమర్పణ

విజయనగరం టౌన్: చల్లని తల్లికి ప్రజలంతా ఘటాలతో చల్లదనం చేస్తారు. ఘటాన్ని అమ్మవారి ప్రతిరూపంగా చూసుకుంటూ భక్తులు తల్లికి మొక్కుబడులు చెల్లిస్తారు. పైడితల్లి జాతర మహోత్సవాల్లో నెల రోజుల పాటు భక్తులు నిత్యం అమ్మకు ఘటాలను సమర్పిస్తారు. అమ్మవారి సన్నిధానంలో రెండు తల్లి ఘటాలు, ఆరు పిల్ల ఘటాలు ఉంటాయి. నిత్యం ఆ ఘటాలు అమ్మవారి రూపంలో పూజలందుకుంటాయి. ఈ ఏడాది ఇప్పటికే సుమారు 30 వేల మందికి పైగా భక్తులు అమ్మవారికి వనంగుడి, చదురుగుడిలలో ఘటాలను సమర్పించి మొక్కులు చెల్లించారు.

వివిధ రూపాల్లో ఘటాలు

మట్టి కుండ, బిందె, చెంబు, తదితర రూపాల్లో అమ్మవారికి ఘటాలు చెల్లిస్తారు. కొందరు ఘటంలో పసుపు నీరు, మిరియాలు, బెల్లం వేయగా... మరికొందరు పప్పు, బియ్యం, వేప ఆకులు వేసి పైన దీపం పెట్టి పైడితల్లికి సమర్పిస్తారు. అమ్మవారి సిరిమానోత్సవం పూర్తయిన తర్వాత ఊర్లోకి అమ్మవారి ఘటాలను తీసుకువస్తారు. కోటలో ఘటాలను సమర్పించిన తర్వాత వనంగుడిలోని బాలాలయం వద్ద ఉన్న అమ్మవారి చదురు వద్ద అన్న కూటి ఘటాలను పెట్టి పూజలు చేస్తారు. ఉయ్యాల కంబాల మహోత్సవం వరకు భక్తులు నిత్యం ఘటాలను సమర్పిస్తుంటారు.

అమ్మవారికి ఘటమే ప్రీతి..



పైడితల్లి అమ్మవారికి ఘటం తీసుకోవడం ఎంతో ప్రీతి. భక్తులు తమ మొక్కుబడులు చెల్లించుకోవడానికి అమ్మకు ఘటాన్ని ఇస్తారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు అమ్మవారికి ఘటంతో పాటు పసుపు, కుంకుమలు చెల్లిస్తారు.

– సాయికృష్ణ, వేదపండితుడు, పైడితల్లి దేవస్థానం

వితరణ

విజయనగరం ఫోర్ట్: పట్టంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయం ఎదురుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరాశ్రయుల కేంద్రానికి విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ డి. చంద్రశేఖర్ హాట్‌బాక్స్, విశ్రాంత ఇంజినీర్ ఎం.సత్యనారాయణ ఫ్యాన్‌లు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.



హాట్‌బాక్స్ అందజేస్తున్న చంద్రశేఖర్

సాంస్కృతిక ప్రదర్శనల 'కళాక్షేత్రం'



నర్తనశాల డ్యాన్స్ అకాడమీ విద్యార్థినుల నృత్య ప్రదర్శన

- అలరించిన నృత్య, సంగీత ప్రదర్శనలు

విజయనగరం టౌన్: విజయనగరం ఉత్సవాలు – 2024లో భాగంగా ఆదివారం స్థానిక ఆనంద గజపతి కళాక్షేత్రంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆహూతులను అలరించాయి. ఎస్.గోపాలరావు బృందం నాదస్వర కచేరి.. జి.రాధాకుమారి, ఎస్.పెంటయ్యనాయుడుల భక్తి సంగీతం.. బుర్ర సాయికృప, సాయి మానస బృందం శాస్త్రీయ సంగీతం.. నర్తనశాల డ్యాన్స్ అకాడమీ డాక్టర్ బి.రాధికారాణి బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన.. ఎ.శైలజ టీమ్ క్లాసికల్ డ్యాన్స్.. కె.వీరరాఘవమ్మ బృందం, శ్రీ ప్రసన్న నృత్య కళానికేతన్ బృందం, శ్రీ సూర్య అకాడమీ టీవీ రామకశ్యప్ బృందం, బి.పద్మ బృందం భరతనాట్యం.. పి.పద్మావతి టీమ్ వీణ కచేరీలు ఆకట్టుకున్నాయి. అనంతరం సప్త స్వరాలయం శాస్త్రీయ సంగీతం.. వై.సాయిదుర్గాప్రసాద్ వయోలిన్.. ఉమాకామేశ్వరి టీమ్ భక్తి సంగీతం.. శ్రీఆదిభట్ల కళాక్షేత్రం కూచిపూడి.. నిత్య దైవ నామస్మరణ సేవాసమితి పి.ఉమాశంకర్ భరతనాట్యం.. ఐ.మెహర్‌లత భక్తి సంగీతం.. ఎస్.సాయి సంపత్ టీమ్ శాస్త్రీయ సంగీతం.. వి.గణేష్ మృదంగం.. ఎం.ధనలక్ష్మి బృందం శాస్త్రీయ సంగీతం.. ఐ.గౌతమీశివానీ వీణ.. డాక్టర్ మండపాక రవి మృదంగం.. శ్వేతకీర్తి, కె.విద్యాసాగర్ టీమ్‌ల భక్తి సంగీతం.. ఎం.సౌభాగ్యలక్ష్మి, టి.తన్మయిల భరతనాట్యం .. బి.ధనుంజయ్ తబల.. బి.పైడిరాజు టీమ్ భక్తి, సెమీ క్లాసికల్ ప్రదర్శన.. శ్రీవారి స్వచ్ఛంద సేవా సంఘం ఎం.భీష్మారావు ఆధ్వర్యంలో భక్తి సంగీత విభావరి ఆద్యంతం ఆహూతులను కట్టి పడేశాయి.

వేంకటేశ్వరస్వామికి చక్రస్నానం



రామపుష్కరిణిలో స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని రామస్వామి వారి పుష్కరిణిలో వేంకటేశ్వర స్వామికి చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల నుంచి రామస్వామివారి దేవస్థానంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన వేంకటేశ్వరస్వామివారికి జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి శనివారం చక్రస్నానం జరిపించారు. ఉదయం సుప్రభాతసేవ, బాలభోగం తర్వాత యాగశాలలో పూర్ణాహుతి, విశేష హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి సుదర్శన పెరుమాళ్లను గ్రామ తిరువీధుల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లి రామ పుష్కరిణిలో ఆశీనులు చేశారు. మంగళ వాయిద్యాలతో స్వామివారి సుదర్శన పెరుమాళ్లకు విశేష అర్చనలు చేపట్టి చక్రస్నానం జరిపించారు. తర్వాత ఊరేగింపుగా ఆలయంలోనికి తీసుకువెళ్లి హోమ బలిహరణం గావించారు. అలాగే రాత్రి 8 గంటలకు ధ్వజావరోహణ కార్యక్రమాన్ని ఎంతో వైభవంగా నిర్వహించి, బ్రహ్మోత్సవాలు ప్రారంభం రోజున ధ్వజస్తంభంపై ఎగురవేసిన గరుత్మంతుడు చిత్రపటాన్ని అర్చకుల వేదమంత్రోచ్చారణల నడుమ కిందకు దించారు. శ్రీవారికి ఆదివారం పుష్పార్చన చేపట్టి బ్రహ్మోత్సవాలను పూర్తి చేశారు. కార్యక్రమంలో అర్చకులు, దేవస్థాన సిబ్బంది, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

దేవుని నెలివాడలో చోరీ



బీరువాను పరిశీలిస్తున్న ఎస్సై గణేష్, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం పంచాయతీ పరిధిలోని దేవుని నెలివాడ గ్రామంలో ఓ ఇంట్లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ సంఘటనపై బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దంతినాడ ఉమామహేశ్వరరావు దసరా పండగ సందర్భంగా తన కుటుంబ సభ్యులతో కలిసి రామతీర్థంలో ఉన్న అత్తవారింటికి శనివారం వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు గ్రిల్స్ లేని కిటికీ అద్దాన్ని పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా తలుపులు విరగ్గొట్టి నగదు, బంగారాన్ని దోచుకున్నారు. ఇంటి నిర్మాణం కోసం ముందు రోజే అప్పుగా తీసుకు వచ్చిన రూ.లక్ష నగదుతో పాటు.. 15 గ్రాముల బంగారం అపహరణకు గురైందని బాధిత కుటుంబ సభ్యులు వాపోయారు. బాధితుల సమాచారం మేరకు ఎస్సై గణేష్ , సిబ్బంది సంఘటనా స్థలానికి ఆదివారం చేరుకుని పరిస్థితి సమీక్షించారు. క్లూస్ టీమ్ సభ్యులు వేలిముద్రలను సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గణేష్ తెలిపారు.

ఆకట్టుకున్న భువన విజయం..



భువన విజయం కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయనగరం టౌన్: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఎంఆర్ లేడీస్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఉన్న సాహిత్య వేదికపై ఆదివారం నిర్వహించిన సంగీత, సాహిత్య సమరాంగణ భువన విజయం, శతాధిక కవి సమ్మేళనం ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి. భువన విజయం కార్యక్రమానికి డాక్టర్ జక్కు రామకృష్ణ, కట్టమూరి చంద్రశేఖరరావు అనుసంధానకర్తలుగా వ్యవహరించారు. అనంతరం కళాకారులను నిర్వహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం నిర్వహించిన శతాధిక కవిసమ్మేళనం కార్యక్రమాన్ని రత్నాల బాలకృష్ణ, చీకటి దివాకర్, భోగరాజు సూర్యలక్ష్మి, మానాప్రగడ సాహితి అధ్యక్షత వహించారు. పలువురు కవులు తమ కవితలను వినిపించగా.. నిర్వాహకులు వారిని సత్కరించారు. కార్యక్రమాలను డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.తిరుపతినాయుడు, స్కిల్ డవలప్‌మెంట్ అధికారి జి.ప్రశాంత్‌కుమార్, జిల్లా సహకార అధికారి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విజయనగర వైభవం శతకం ఆవిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, తదితరులు

విజయనగరం టౌన్: విజయనగర ఉత్సవం 2024 ప్రారంభ సభలో మంగిపూడి రాధిక రాసిన విజయనగర వైభవ శతకం పుస్తకాన్ని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కలెక్టర్ అంబేడ్కర్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తదితర ప్రముఖులు ఆదివారం ఆవిష్కరించారు. విజయనగరం చరిత్ర, వారసత్వం, కళలు, అక్కడ పుట్టిన మహానుభావులు, ఒక్కొక్క విషయాన్ని గురించి ఒక్కొక్క తేటగీతి పద్యాన్ని రూపొందించి 111 పద్యాలతో విజయనగర వైభవ శతకాన్ని ఆమె రచించారు. విజయనగరం జిల్లా వైభవాన్ని కీర్తిస్తూ వెలువడుతున్న తొలి పద్య శతకమిదని తెలిపారు. సాగి జ్ఞానాంబ మెమోరియల్ బుక్ ట్రస్ట్ ఈ పుస్తకాన్ని ప్రచురించింది.

పైడితల్లి పూజా పుస్తకం..

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి పూజా పుస్తకాన్ని పైడితల్లి అమ్మవారి దేవస్థానం అనువంశిక ధర్మకర్త, చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజులు ఆదివారం అశోక్ బంగ్లాలో ఆవిష్కరించారు. పైడిమాంబ దీక్షాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో నేతృత్వంలో రూపొందించిన పూజా పుస్తక విధానం భక్తులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభినందనలు తెలిపారు.

పైడితల్లిని దర్శించుకున్న ప్రముఖులు



స్పీకర్ అయ్యన్నపాత్రుడికి వేదాశీస్సులు అందజేస్తున్న వేదపండితులు పక్కన మంత్రి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే అదితి



అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను ఎమ్మెల్యేకు అందజేస్తున్న ఆలయ అధికారులు

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారిని పలువురు ప్రముఖులు ఆదివారం దర్శించుకున్నారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, చీపురుపల్లి శాసనసభ్యుడు కిమిడి కళా వెంకటరావు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆలయ మర్యాదల ప్రకారం వీరికి స్వాగతం పలికి, అమ్మవారి ప్రసాదం అందజేశార.

– విజయనగరం టౌన్

విజయనగరంలో సందడే.. సందడి..



విజయనగరం రూరల్: వేదికపై హాస్యపు జల్లులు కురిపిస్తున్న హైపర్ ఆది టీమ్



విజయనగరం రూరల్: పాటలు పాడుతున్న గాయకులు



విజయనగరం టౌన్: విద్యార్థుల జానపద కళారూపం




సాక్షి ఫొటోగ్రాఫర్ : కోటలో చిన్నారుల నృత్యం

విజయనగరం ఉత్సవాలు ఓ వైపు.. పైడితల్లి జాతర సందడి మరోవైపు.. దీంతో విజయనగరం పట్టణం సందడిగా మారింది. ఎటువైపు చూసిన సాంస్కృతిక కార్యక్రమాలే.. ఎక్కడ చూసినా జన సందోహమే.. కళాకారులు తమ నటనా పటిమతో ఆహూతులను రంజింపజేయగా.. ప్రతిగా తమ కరతాలధ్వనులతో ప్రేక్షకులు కళాకారులను ప్రోత్సహించారు. గురజాడ కళాక్షేత్రంలో మహిళలు, సీనియర్ సిటిజన్లు ప్రదర్శించిన కన్యాశుల్కం నాటిక ఆకట్టుకుంది. అలాగే పౌరాణిక నాటక ఘట్టాలు, ఏకపాత్రాభినయనాలు, జానపద నృత్యాలు, తప్పెటగుళ్లు, పులివేషాలు, కోలాటం, బుర్రకథ, కత్తిసాము, విజయనగర వైభవం డాక్యుమెంటరీ ప్రదర్శన, లేజర్‌షో ఆకట్టుకున్నాయి. అయోధ్య మైదానంలో ఇండియన్ ఐడల్ ఆర్కెస్ట్రా పవన్‌సాయి బృందం పలు పాటలు ఆలపించారు. అలాగే గజల్ వినోద్ గజల్స్, జబర్దస్త్ నటులు హైపర్ ఆది, దొరబాబు, రైజింగ్ రాజు, మురళీధర్, గణపతి, అప్పారావు, సరదా సత్తిపండు, తదితరుల ప్రదర్శించిన స్కిట్స్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. గాయకులు చాగంటి సాహితి, అరుణ్ కౌండిన్య, సాయిచరణ్, దామిని, తదితరులు తమ పాటలతో సందడి చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



విజయనగరం టౌన్: కన్యాశుల్కంలో ఓ సన్నివేశం



విజయనగరం ఫోర్ట్: లేజర్ షో తిలకిస్తున్న ప్రజలు

సారిపల్లిలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



సారిపల్లిలో మండపంలో కొలువైన దుర్గమ్మ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లిలో దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. విజయదశమి నుంచి ఉత్సవాలు జరిపించడం ఎన్నో ఏళ్లుగా ఆనవాయితీగా వస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు. గణేష్ ఉత్సవ కమిటీ, మోటార్ యూనియన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేక మండపంలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజులు అమ్మవారికి విశేష పూజలు చేపట్టి, ఈ నెల 20న నిమజ్జనోత్సవాన్ని జరిపిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

విజయనగరం
9951602843
Office mail : vzmadvt@gmail.com